అబుల్ కలాం ఆజాద్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-పాడేరు: మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు శనివారం జాతీయ విద్యా దినోత్సవం, అల్ప సంఖ్యాకవర్గముల సంక్షేమ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి జిల్లా కలక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆజాద్ చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భారత దేశానికి మొట్ట మొదటి విద్యాశాఖా మంత్రిగా ఆజాద్ విద్యా వ్యవస్థలో అనేక మార్పులకు కృషి చేసారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ పి. అంబేద్కర్, ఎపిఎంఐపి ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.ఎ. రహీం, అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమ శాఖ ఎఒ వివిఎస్ఎన్ శర్మ, డిపిఓ జయప్రకాశ్, అరకు వేలి మషీద్ అధ్యక్షులు గులాం హైదర్ ఆలి, పద్మాపురం వార్డ్ సభ్యులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న కలెక్టర్

ఎన్ఇపితో ప్రభుత్వ విద్యకు తీవ్ర నష్టం

- ★ సర్కారు పాఠశాలలను నిర్వీర్యం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- ★ జిపిఎస్ పేరుతో మోసం
- ★ ఉభయగోదావరి జిల్లా పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు
- ★ అల్లూరి స్ఫూర్తితో పోరాటాలు : యుటిఎఫ్ నేత ప్రసాద్

యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఉభయ గోదావరి జిల్లాల పిడిఎఫ్ ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన జాతీయ విద్యా విధానం (ఎన్ఇపి) వలన ప్రభుత్వ విద్యా వ్యవస్థకు తీవ్ర నష్టం జరుగుతుందని ఉభయగోదావరి జిల్లాల పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు అన్నారు. ఆ విధానాన్ని వ్యతిరేకించాల్సిన రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం కేంద్రానికి వత్తాసు పలుకుతోందని, ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తుందని విమర్శించారు. ఈ విధానం వలన ఉపాధ్యాయ పోస్టులు తగ్గిపోవడంతో పాటు పేద మధ్య తరగతి విద్యార్థులు విద్యకు దూరమయ్యే పరిస్థితి వస్తుందని, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలకు లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం జరిగిన యుటిఎఫ్ అల్లూరి సీతారామరాజు జిల్లా ద్వితీయ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. సిపిఎస్‌ను రద్దు చేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి, ఇప్పుడు జిపిఎస్ పేరుతో ఉపాధ్యాయులను మోసం చేయడం దారుణమన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన 117 జీవోని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు వాక్ స్వాతంత్ర్యం లేదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఒకటో తేదీన జీతం వేయాల్సి ఉండగా, నెలలో ఎప్పుడు వస్తుందో, లేదో తెలియని అయోమయ పరిస్థితి నెలకొందని, ఇటువంటి స్థితి గతంలో ఎన్నడూ లేదని పేర్కొన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం ప్రశ్నించకపోతే మరణించినట్లేనన్నారు.

యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. తమ సమస్యలపై పోరాడుతున్న నాయకులను రాబోయే ఎన్నికలలో గెలిపించుకొని అసెంబ్లీకి పంపించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఉపాధ్యాయులందరూ ఆ దిశగా కృషి చేయాలని కోరారు. పాత పెన్షన్ విధానం కొనసాగించి, సిపిఎస్‌ను రద్దు చేయాలని, ఇతర ప్రజా సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15న విజయవాడలో సిపిఎం ఆధ్వర్యంలో జరుగు ప్రజా రక్షణ భేరి కార్యక్రమానికి మద్దతు తెలపాలని, పెద్ద సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు.

గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కోసం అలుపెరుగని పోరాటం చేస్తున్నది రాష్ట్రంలో యూటీఎఫ్ తప్ప మరో సంఘం లేదన్నారు. ఎస్‌టిఎఫ్ఐ జాతీయ ఉపాధ్యక్షురాలు ఎన్.అరుణకుమారి, యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె.శ్రీనివాసరావు, ఎఎస్ఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.మహేశ్వరరావు మాట్లాడుతూ 2024లో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని గద్దె దింపితే గాని రాష్ట్రానికి మంచి రోజులు రావన్నారు. ఉపాధ్యాయ హక్కులు సాధన కోసం ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సూరారెడ్డి, జిల్లా పరిషత్ పాఠశాల హెచ్ఎం గోపాలకృష్ణ, యుటిఎఫ్ నాయకులు ఉదయ్ మనోహర్, పి.మంగరాజు, కె.కృష్ణ, ఎం.కవిత, కె.ఆదిరెడ్డి, కె.ఆంద్రయ్య, టి.చిట్టిబాబు, కె.రఘునాథ్, పి.రమణ, పైడిమల్లు పెద్ద సంఖ్యలో యుటిఎఫ్ నేతలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్తేజపూరితంగా యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం

డప్పులు ప్రదర్శన చేస్తున్న ప్రజా నాట్య మండలి కళాకారులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) అల్లూరి సీతారామరాజు జిల్లా ద్వితీయ కౌన్సిల్ సమావేశం శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వై.విల్సన్‌బాబు అధ్యక్షతన ఎంతో ఉత్సాహంగా, ఉత్తేజ భరితంగా జరిగింది. తొలిత యుటిఎఫ్ ఉద్యమ జెండాను సీనియర్ నేతలు ఆవిష్కరించారు. యుటిఎఫ్ ఉద్యమ సారథులు, అమరుల చిత్రపటాలకు ఉభయ గోదావరి జిల్లాల పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు, యుటిఎఫ్ రాష్ట్ర, జిల్లా నాయకులు పూలమాలలు వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం గ్రామ పురవీధుల్లో భారీ ప్రదర్శన నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహాలకు ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, ప్రజానాట్యమండలి కళాకారుల డప్పు వాయిద్యాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రదర్శనలో ఎమ్మెల్సీ ఐవి ఉపాధ్యాయులతో కలిసి నృత్యం చేశారు. యుటిఎఫ్, గిరిజన సంఘం నేతల ప్రసంగాలు ఉత్తేజపరిచాయి. అల్లూరి జిల్లా నలుమూలల నుండి వచ్చిన ఉపాధ్యాయులతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. యుటిఎఫ్ ఎర్రజెండాలతో రాజవొమ్మంగి మండల ప్రధాన కూడళ్ళు ఎరుపెక్కాయి. ఉపాధ్యాయుల నినాదాలతో రాజవొమ్మంగి దద్దరిల్లింది.

రోడ్డు సౌకర్యం కల్పించాలని డోలీమోతతో నిరసన

ప్రజాశక్తి -కొయ్యూరు

మండలంలోని మూలపేట పంచాయతీ జాజులబంద గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని కోరుతు ఆ గ్రామస్థులు శుక్ర వారం డోలీమోతతో నిరసన తెలిపారు. రహదారి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో అనారోగ్యంతో బాధపడుతున్న వారిని ఆసుపత్రికి తీసుకెళ్లాలంటే డోలీమోత తప్పడం లేదన్నారు. అర్ల గ్రామం వరకూ రహదారి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

తాగొద్దని వారించిన భార్య హత్య

ప్రజాశక్తి-కొయ్యూరు

మద్యం తాగొద్దని వారించిన భార్యను ఆమె భర్త అతి కిరాతకంగా కర్రతో కొట్టి హత్య చేశాడు. కొయ్యూరు పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని డౌనూరు పంచాయతీ పాలమామిడి గ్రామానికి చెందిన కొర్రా సత్తిబాబు శుక్రవారం పూటుగా మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. దీంతో ఆయన భార్య లక్ష్మి తాగుడు మానాలని, మరెప్పుడు తాగొద్దని వారించింది. దీంతో మద్యం మత్తులో విచక్షణ కోల్పోయిన సత్తిబాబు కర్రతో లక్ష్మి తలపై బలంగా కొట్టాడు. దీంతో లక్ష్మి మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఎస్సై రాజారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అడవి జంతువులను వేటాడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి-మారేడుమిల్లి

మండలంలో అడవి జంతువులను వేటాడినా, మాంసాన్ని అక్రమంగా సరఫరా చేసినా కఠిన చర్యలు తప్పవని రంపచోడవరం, మారేడుమిల్లి అటవీ క్షేత్రాధికారి ఆజాద్ హెచ్చరించారు. గత నెల 6న మండలంలోని గాలిగోపురం సమీపంలో వేటగాళ్ల బాణాలకు అడవి దున్న మరణించి నేపథ్యంలో అటవీ శాఖ సిబ్బంది మండలంలో పలు అనుమానిత గ్రామాల్లో తనిఖీ నిర్వహించి విల్లంబు, బాణాలు స్వాధీనం చేసుకున్నారు. వీటిని శనివారం అటవీ క్షేత్రాధికారి ఆజాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరి దగ్గరైనా నాటు తుపాకులు ఉంటే స్వచ్ఛందంగా ఫారెస్ట్ డిపార్ట్మెంట్ వారికి అప్పగించాలని సూచించారు. తమ తనిఖీల్లో నాటుతుపాకులు దొరికితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గిరిజనుల నుండి స్వాధీనం చేసుకున్న విల్లంబులు

లాంగ్ జంప్ కోర్టు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

జెకెసిటి ఆధ్వర్యాన లాంగ్ జంప్ కోర్టు ఏర్పాటు

ప్రజాశక్తి-చింతూరు

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జమాల్ ఖాన్ ఛారిటబుల్ ట్రస్టు (జెకెసిటి) ఆధ్వర్యాన లాంగ్ జంప్ కోర్టును శనివారం ఏర్పాటు చేశారు. జెసిబితో అడుగులోతు, 10 అడుగుల వెడల్పు తవ్వి, ఇసుకతో నింపి లాంగ్ జంప్ అనుకూలంగా కోర్టును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్ మాట్లాడుతూ నవంబర్ 14న బాలల దినోత్సవం సందర్భంగా క్రీడా పోటీలు నిర్వహించేందుకు వీలుగా దీనిని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. క్రీడలు ఆరోగ్యానికి విద్యార్థుల భవిష్యత్తుకు దోహదపడతాయని చెప్పారు. పాఠశాలకు కావాల్సిన ఇతర క్రీడా సామాగ్రి లిస్టు ఇస్తే ఏర్పాటు చేస్తామని చెప్పారు. కోరిన వెంటనే లాంగ్ జంప్ కోర్టు ఏర్పాటు చేసిన జమాల్ ఖాన్‌కు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.బాలకృష్ణ రమేష్, రాజు, కె.నాగరాజు, భద్రయ్య, ఎస్.సుబ్బయ్య, వి.సుజాత, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో 30 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి-రంపచోడవరం

మండలం రంప పంచాయతీ మర్రివాడ గ్రామానికి చెందిన 30 కుటుంబాల వారు జనసేన మండల అధ్యక్షులు పిఆర్‌పి శ్రీను అధ్వర్యంలో శనివారం ఆ పార్టీలో చేరారు. వీరికి నియోజకవర్గ నాయకులు కుర్ల రాజశేఖరరెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అర్హులకు అందటం లేదని, కనీస సౌకర్యాలైన రోడ్లు, ఆరోగ్యం, సురక్షిత మంచినీరు, అందించటంలో ప్రభుత్వం విఫలమైందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొణతం శ్రీనివాస్, ఆకుల జయరామ్, గుగులు సుబ్రమణ్యం, యర్రగొండ మల్లేశ్వరరావు, సింగోజి సుబ్రమణ్యం, వేదురుపల్లి కృష్ణ పాల్గొన్నారు.

అనంతగిరిలో మాట్లాడుతున్న జెడ్పిటిసి సభ్యులు గంగరాజు

టూరిజం కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యం

-మూతపడిన రెస్టారెంట్లు, రిసార్టులు, బొర్రా గుహలు- పలు యూనిట్ల వద్ద సమ్మె

ప్రజాశక్తి- యంత్రాంగం

తమ సమస్యలను పరిష్కరించాలని పర్యాటక శాఖ కాంట్రాక్టు, మేన్ పవర్, ఔట్సోర్సింగ్, డైలీ వేస్ కార్మికులు శనివారం సమ్మె ప్రారంభించారు. అరకులోయలోని పర్యాటకశాఖ హరిత హిల్ రిసార్ట్స్, పున్నమి వ్యాలి రిసార్ట్స్, రెస్టారెంట్లు మూతపడ్డాయి.

అరకులోయ: తక్షణమే టూరిజం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని ఏపీ టూరిజం కార్మికులు అరకులోయలోని హరిత వ్యాలీ సమ్మె శిబిరంలో ఆయన మాట్లాడుతూ, సమస్యలు పరిష్కరించాలని సుదీర్ఘ కాలం నుంచి కార్మికులు సమ్మె చేస్తున్నా టూరిజం యాజమాన్యం కనీసం స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులందరికీ హెచ్.ఆర్ పాలసీని అమలు చేయాలన్నారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. టూరిజం ఎండి కన్నబాబు, అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సమక్షంలో చర్చలు జరిగినా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా పర్యాటకశాఖ అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

అనంతగిరి: సమస్యలు పరిష్కారానికి 2010 సంవత్సరంలో కుదుర్చుకున్న ఒప్పందల హామీలను పరిష్కరించకుంటే ఈ పోరాటం మరింత ఉధృతం చేస్తామని జెడ్పిటిసి దీసరి. గంగారాజు తెలిపారు. పర్యాటక శాఖలో పని చేస్తున్న డైలీ వేజ్, కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరిం చాలన్నారు. సమ్మెకు సంపూర్ణ మద్దతుగా స్థానిక సీపిఎం జెడ్పిటిసి దీసరి.గంగరాజు, టోకురు సర్పంచ్ కె, మొస్యలు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ, కార్మికులతో శ్రమ దోపిడి చేయించుకుంటున్నారన్నారు. బొర్రా గుహలతో పాటు అనంతగిరి మండలం టైడా, అనంతగిరి, హరితహిల్ రిసార్ట్స్, అరకు, మయూరి కార్మికులు గత 30 సంవత్సరాల నుండి నమ్ముకుని విధులు కొనసాగిస్తున్నా పట్టించుకునే నాథుడే లేడని తెలిపారు. కార్మికులకు కనీస వేతనాలు, రాయితీలు చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు.సమాన పనికి సమాన వేతనం చెల్లించవలసి ఉన్నప్పటికీ దీన్ని అమలు చేయలేదని విమర్శించారు. ఈ పోరాటం ఇంతటితో ఆగదని కార్మికుల సమస్యలకు పరిష్కారం చూపేవరకు పోరాటం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు.

చింతపల్లి: టూరిజం కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కారం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు పాంగి ధనుంజయ్ డిమాతండ్ చేశారు. ఈ మేరకు ఏపీ టూరిజం లంబసింగి (హరిత రిసార్ట్స్) కార్మికు లు చేస్తున్న సమ్మెలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, గతంలో చర్చల సందర్భంగా ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడం అన్యాయమన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మృతి చెందిన కార్మిక కుటుంబానికి అదే కేటగిరిలో తక్షణం ఉద్యోగం కల్పించాలన్నారు. డైలీ వేజ్ కార్మికులందరినీ ఆప్కాస్‌లో కలపాలన్నారు. యూనిట్లను తక్షణమే బాగు చేయాలని, కార్మికులకు బస్ పాస్, ఏజెన్సీ అలవెన్సులు, యూనిఫామ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి టూరిజం లంబసింగి నాయకులు కుర్ర రఘురాం, చల్ల కృష్ణ, చేడంగి వరప్రసాద్, శ్యామల, పైలా గణేష్ పాల్గొన్నారు

అరకులో సమ్మె చేస్తున్న కార్మికులు

15న గవర్నర్ పర్యటన

ప్రజాశక్తి-పాడేరు: ఈనెల 15న రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ అరకు పర్యటనను విజయవంతం చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం సంబంధిత అధికారులతో నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో ప్రాజెక్ట్ అధికారి మాట్లాడుతూ, ఆ రోజు బిర్సా ముండా జయంతి ఉత్సవంలో భాగంగా జన జాతీయ గౌరవ దినోత్సవ్, విక్షిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాలను గవర్నర్ ప్రారంభిస్తారని తెలిపారు. అదే రోజు భారత ప్రధానమంత్రి జార్ఖండ్ నుంచి ఈ కార్యక్రమాలను వర్చువల్ విధానంలో ప్రారంభిస్తారని, ఇందులో భాగంగా గవర్నర్ అరకు నుంచి ప్రారంభిస్తారని వివరించారు. పెద్దలబుడు గ్రామం వద్ద హెలిప్యాడ్, క్రీడా పాఠశాల మైదానంలో సభ వేదిక ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వీడివీకే, జిసిసి, సికిల్ సెల్ అనీమియా, ఫోటో ఎగ్జిబిషన్ స్టాల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విక్షిత్ భారత్ సంకల్పయాత్ర వాహనాలను గవర్నర్ ప్రారంభిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు, ఉజ్వల పథకం కింద గ్యాస్ కనెక్షన్లను గవర్నర్ పంపిణీ చేస్తారని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రధానమంత్రి వర్చువల్ కార్యక్రమానికి అవసరమైన ఇంటర్నెట్, వైఫై, లైవ్ టెలికాస్టింగ్ ఏర్పాట్లు చేయాలని, కార్నివాల్ ప్రదర్శన ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ టెలి కాన్ఫరెన్స్‌లో ఆర్అండ్‌బి, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులు, పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్మెంట్ అధికారులు పాల్గొన్నారు.

బాణాసంచా వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలి

-టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి - జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా

ప్రజాశక్తి-పాడేరు: దీపావళిని పురస్కరించుకొని బాణాసంచా విక్రయదారులు అప్రమత్తంగా అమ్మకాలు నిర్వహించాలని నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని అల్లూరి జిల్లా ఎస్పి తుహిన్ సిన్హా హెచ్చరించారు. దీపావళి సందర్భంగా ప్రజలకు ముందస్తు శుభాకాంక్షలు తెలుపుతూ, భద్రత ప్రమాణాలు దృష్టిలో ఉంచుకొని పండుగను ఆనందంగా జరుపుకోవాలని శనివారం ఒక ప్రకటనలో సూచించారు.అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా టపాసులు నిల్వ ఉంచినా, విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. బాణసంచా విక్రయదారులు చట్టం సూచించిన నిబంధనలు, జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. టపాసులు కాల్చేటప్పుడు ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. టపాసులు అక్రమంగా విక్రయిస్తున్నా, నిల్వ ఉంచినా డయల్ 100, స్థానిక పోలీసు స్టేషన్‌లో సమాచారం అందించాలని సూచించారు.

ప్రమాదాలకు తావు లేకుండా, సరైన భద్రతా ప్రమాణాలు పాటిస్తూ విక్రయించాలని సూచించారు. పోలీసులు నిర్ణయించిన బహిరంగ ప్రదేశాలలో మాత్రమే నిర్ణీత కొలతల మేరకు ప్రత్యేక షెడ్డులలో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.నీరు, ఇసుక, తదితర అగ్నిమాపక సామాగ్రిని తప్పనిసరిగా టపాసుల విక్రయ దుకాణాల్లో సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. చిన్న పిల్లలను విక్రయాల పనుల్లో ఉంచుకోరాదన్నారు. దీపావళి రోజున రాత్రి 7 గంటల నుంచి 10 గంటల వరకు మాత్రమే టపాసులు పేల్చాలని తెలిపారు.పరిమితికి మించి శబ్దం వచ్చే టపాసులు కాల్చొద్దని.. దీంతో వాయు, శబ్ద కాలుష్యం పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ మార్గదర్శకాలను ఎవరైనా ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

పాడి పశువులతో ఆర్థికాభివృద్ధి

ప్రజాశక్తి-హుకుంపేట: పాడి పశువుల పెంపకం తో ఆర్థిక తోడ్పాటు కలుగుతుందని మఠం పంచాయతీ సర్పంచ్ మఠం శాంత కుమారి అన్నారు. శనివారం మఠం కొత్తూరు గ్రామంలో వెటర్నరీ అసిస్టెంట్ శైలజ ఆధ్వర్యంలో నిర్వహించిన పశు విజ్ఞాన బడి కార్యక్రమం లో ఆమె పాల్గొన్నారు. అనంతరం గిరిజన రైతులతో ఆమె మాట్లాడుతూ, పాడి పశువులు, మేకలు, కోళ్ల పెంపకంతో ఆర్థికంగా మంచి లాభాలు పొందవచ్చునని పేర్కొన్నారు. అనారోగ్యం లేదా పిడుగు పాటుతో మేకలు మృతి చెందితే ప్రభుత్వం ఒక్కో మేకకి రూ.15 వేల ఇన్సూరెన్స్ ఇస్తుందని అన్నారు. రైతులు కేవలం ముప్పై రూపాయలు కడితే, ఇన్సూరెన్స్ వర్తిస్తుందన్నారు. 20 మంది రైతులకు పశు హెల్త్ కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు సభ్యులు పాంగి మత్స్య కొండ బాబు, గెమ్మెలి అప్పారావు, వాలంటీర్ మహేష్ బాబు పాల్గొన్నారు.

పశు హెల్త్ కార్డులను ఇస్తున్న సర్పంచ్

గిరిజనులకు దీపావళి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-పాడేరు: దీపావళి పండుగల జిల్లాలోని ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని, అందరూ సుఖ సంతోషాలతో జీవించాలని ఆశిస్తూ జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఒక్కొక్క మార్పు సాధించుకుంటూ గొప్ప జీవితాన్ని నిర్మించు కోవాలని, చీకట్లను తరిమేసే దీపావళి ప్రజల జీవితంలో కొత్త వెలుగులు తీసుకు రావాలని ఆకాంక్షిస్తూ ఐటిడిఎ పిఓ వి.అభిషేక్ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు.

కాలం చెల్లిన మందులు

అరకులోయ ఏరియా ఆసుపత్రిలో కాలం చెల్లిన మందులు

- చిన్నారికి ఇచ్చిన వైద్య సిబ్బంది
- తల్లిదండ్రులు ఆరా తీయగా చూసుకోలేదని సమాధానం

ప్రజాశక్తి-అరకులోయరూరల్: అరకులోయ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో కాలం చెల్లిన మందులు కలకలం రేపాయి. .బాధితుల కథనం మేరకు. ...శుక్రవారం అరకు ఏరియా ఆసుపత్రికి 6 నెలల చిన్న పాపను తల్లిదండ్రులు తీసుకు వెళ్లారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులు రాశారు. ఆసుపత్రి మందుల కౌంటర్లో మందులు సీటును చూపించి నాలుగు రకాల టానిక్కులు తీసుకున్నారు. అందులో మూడు రకాల టానిక్కులు నాణ్యతగా ఉన్నాయి. ఒక్క అమోక్సిసిలిన్, పొటాసియన్ క్లావులనేట్ ఓరల్ పౌడర్ మాత్రం 2023 అక్టోబర్ నెలతో కాలం చెల్లిపోయింది. ఈ మందులను తల్లిదండ్రులకు సిబ్బంది ఇవ్వడంతో ఒక్క సారిగా వారు అవాక్కయ్యారు. ఇటువంటి కాలం చెల్లిన మందులు చిన్నపిల్లలు వేసుకుంటే తీవ్ర అస్వస్థతకు గురికావడం తప్పదు.అరకు ఏరియా గిరిజనులకు అరకులోయ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రే దిక్కు. రోజుకు ఆసుపత్రికి సుమారు 100-150 వరకు ఓపీ ఉంటుంది. వీరిలో ఎక్కువ మంది చిన్న పిల్లలు వివిధ రకాల అనారోగ్యాలతో వస్తుంటారు.
కాలం చెల్లిన మందులు ఎందుకు ఇచ్చారని తల్లిదండ్రులు సిబ్బందిని అడగ్గా తాము చూసుకోలేదని సమాధానం ఇవ్వడం విశేషం. అధికారులు పట్టించుకోక పోవడంతో వైద్య సిబ్బంది ప్రజల ప్రాణాలతో చెలగాటం అడుతున్నారని తల్లి దండ్రులు మండిపడుతున్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

కార్తీక మాసోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-పాడేరు: పట్టణంలోని ప్రసిద్ధ శైవ క్షేత్రం ఉమా నీలకంటేశ్వరస్వామి దేవాలయంలో ఈనెల 13 నుంచి నిర్వహించనున్న "కార్తీక మాసోత్సవా లపై పోస్టర్లను శనివారం పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, ఆలయ ధర్మకర్త కే.సింహాచలం నాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆలయంలో కార్తీకమాస ఉత్సవాల పూజా కార్యక్రమాలు, అన్న సమారాధన నిర్వహణకు తనవంతు పది వేల విరాళం అందించారు. ఆలయ ధర్మకర్త సింహాచలం నాయుడు మాట్లాడుతూ, కార్తీక మాసం ఆరంభం నుంచి ఆలయంలో ప్రతిరోజు ఉదయం ఐదు గంటల నుంచి ప్రత్యేక పూజలు, సాయంత్రం ఐదున్నర గంటలకు ఆకాశ దీపారాధన జరుగుతాయని తెలిపారు. 23న ఏకాదశి, 26న అభిషేకాలు, డిసెంబర్ 7న మహాన్యాస రుద్రాభిషేకం, 11న మహా అన్నదానం, 12న సహస్ర దీపారాధన నిర్వహిస్తున్నట్లు తెలిపారు, ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక సేవా సంఘం సభ్యులు, ధర్మకర్త కొట్టగుల్లి సింహాచలం నాయుడు, రామం పంతులు, వైస్ ఎంపీపీ గంగాపూజారి శివకుమార్, వర్తక సంఘం అధ్యక్షులు ఇమ్మిడిశెట్టి అనిల్, వుడా త్రినాథ్, ఉప్పల వెంకట రత్నం, కొట్టగుల్లి రామారావు పాల్గొన్నారు.

సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

అటవీ సంరక్షణ చట్ట సవరణకు వ్యతిరేకంగా పోరాడాలి

అఖిలభారత ఆదివాసి సదస్సు- సావనీర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-పాడేరు: అఖిల భారత ఆదివాసి సదస్సు సావనీర్‌ను ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో స్థానిక గిరిజన ఉద్యోగుల భవనంలో శనివారం ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల నాయకులతో ఆవిష్కరణ చేశారు. ఆదివాసులకు, దేశ ప్రజలందరికీ వ్యతిరేకమైన కేంద్ర ప్రభుత్వం చేసిన అటవీ సంరక్షణ(సవరణ) చట్టానికి వ్యతిరేకంగా పోరాడాలని ఈ సందర్భంగా పలువురు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం చేసిన అటవీ సంరక్షణ, జీవ వైవిధ్య, పర్యావరణ చట్ట సవరణలను రద్దు చేయాలని అఖిల భారత కేత్ మజ్దూర్ కిసాన్ సభ (ఏఐకెఎమ్ఎస్) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 12,13 తేదీల్లో విశాఖపట్నంలో "అఖిలభారత ఆదివాసి సదస్సు" నిర్వహించారు. వేలాది మంది ఆదివాసీలతో జరిగిన ఈ సభల్లో రైతుకూలీ, ఆదివాసీ నాయకులు, పర్యావరణ వేత్తలు, ప్రజాతంత్ర వాదులు మాట్లాడిన అనేక విషయాలు, రిపోర్టులు, ఫోటోలతో రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) 'సావనీర్-2023'ను ప్రచురించింది. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి దంతులూరి వర్మ, దండకారణ్య లిబరేషన్ ఆర్గనైజేషన్ నాయకులు చండా ఏలియాలు మాట్లాడుతూ, పర్యావరణానికి నష్టం కలిగించే, ఆదివాసీ హక్కులను హరించే 1980 అటవీ సంరక్షణ చట్టానికి సవరణలను చేసి అడవిలో ఉండే సహజ సంపదలను, ఖనిజాలను బడా కార్పొరేట్లకు అప్పజెప్పడానికి పాలకులు పూనుకుంటున్నారన్నారు. దీనిలో భాగంగా జీవ వైవిధ్య చట్టానికి సవరణలు చేశారని, ఇది ప్రకృతి వనరులకు, పర్యావరణానికి నష్టం కలిగించే విధంగా ఉందని తెలిపారు. ఈ రెండు చట్టాలకు వ్యతిరేకంగా ఆదివాసీల హక్కులు, దేశంలో పర్యావరణ పరిరక్షణ కోసం దేశ వ్యాప్తంగా ఆదివాసి, రైతు కూలీ ప్రజానీకమంతా పోరాటం చేయాలన్నారు. దీనిలో భాగంగానే రైతు కూలీ సంఘం సావనీర్ ప్రచురించిందని, ఆదివాసీ ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏజెన్సీ గిరిజన సంఘం నాయకులు వంజం జోగారావు, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆర్ జగన్ మోహన్ రావు, రైతు కూలీ సంఘం (ఆంధ్ర ప్రదేశ్) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోనమోహనరావు, గిరిజన, బహుజన ఉద్యోగ సంఘాల నాయకులు కె కాంతారావు, పి.రమేష్, పి.కర్రన్న, డిఎస్ఓ నాయకులు ఎన్.జాన్ బాబు పాల్గొన్నారు.

సన్ ఇనిస్టిట్యూషన్స్‌లో దీపావళి వేడుకలు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : దీపావళి సందర్భంగా నగరంలోని సన్ ఇనిస్టిట్యూషన్స్‌లో ఎకో-ఫ్రెండ్లీ గ్రీన్ ఫ్రీ దీపావళి వేడుకలు నిర్వహించారు. ప్రతి సంవత్సరం మాదిరిగా ఈ ఏడాది కూడా ఉత్తమ కళాశాల అవార్డు గెలుచ్చుకున్నందున సంప్రదాయ మార్గంలో లక్ష్మి పూజను నిర్వహించారు. అనంతరం విద్యార్థులచే సంప్రదాయ పాటల నృత్య ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆశా జస్తి మాట్లాడుతూ, గొప్ప భారతీయ సంప్రదాయాన్ని విద్యార్థులకు అలవాటు చేసేందుకు ప్రతి సంవత్సరం తమ సంస్థలో అన్ని భారతీయ వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందించారు. విద్యార్థులు, సిబ్బంది సంప్రదాయ వస్త్రధారణలో ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

దీపావళి వేడుకలు నిర్వహిస్తున్న సన్ ఇనిస్టిట్యూట్ ప్రతినిధులు, విద్యార్థులు

ఈస్టర్న్ ఫ్లీట్ కమాండ్ కమాండింగ్ అధికారి రాజేష్ ధన్‌కర్

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : ఈస్టర్న్ ఫ్లీట్ కమాండ్ కమాండింగ్ అధికారిగా రియర్ అడ్మిరల్ రాజేష్ ధన్‌కర్ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆ స్థానంలో పనిచేస్తున్న రియర్ అడ్మిరల్ గురుచరణ్ సింగ్ నుంచి బాధ్యతలు తీసుకునానరు. నేవల్ డాక్ యార్డులో గార్డుల మార్పు కార్యక్రమం జరిగింది. రియర్ అడ్మిరల్ రాజేష్ ధన్‌కర్ 1990 జులై 1న భారత నావికాదళంలో నియమితులయ్యారు. నావిగేషన్, డైరెక్షన్లో ఆయన నిపుణుడు.

ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం కార్యదర్శిగా పీతల మురళి

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం కార్యదర్శిగా ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉద్యోగి పీతల మురళి నియమితులయ్యారు. ఇటీవల హైదరాబాదులో నేషనల్ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య , ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎన్.మారేష్ ద్వారా నియామక ఉత్తర్వులను స్వీకరించారు. ఈ సందర్భంగా మురళిని ఆంధ్ర విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య పివిజిడి ప్రసాద్‌రెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. అనంతరం పీతల మురళి మాట్లాడుతూ బీసీల ఐక్యతకు, హక్కుల పరిరక్షణకు పూర్తిస్థాయిలో కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో పితాని ప్రసాద్, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

మురళిని అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

న్యుమోనియా వ్యాధిని త్వరగా గుర్తించాలి

డాక్టర్ కుప్పిలి సురేష్‌బాబు



ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : న్యుమోనియా వ్యాధిని త్వరగా గుర్తించి నివారించాలని విశాఖ జిల్లా పిఎంపి అసోసియేషన్ ఆఫ్ ఇండియా కన్వీనర్, సామాజిక ప్రజా వైద్యులు డాక్టర్ కుప్పిలి సురేష్ బాబు పేర్కొన్నారు. ప్రపంచ నిమోనియా దినం నవంబర్ 12ను పురస్కరించుకుని ఆయన వ్యాధి లక్షణలను, నివారణ చర్యలను వివరించారు. ఈ వ్యాధి ముఖ్యంగా ఐదేళ్లలోపు చిన్నారులకు, 60 ఏళ్ల పైబడిన వారిలో ఊపిరితిత్తులకు వస్తుందని తెలిపారు. ఏటా 45 కోట్లు మంది ఈ వ్యాధి భారన పడుతున్నారని తెలిపారు. అందులో నాలుగు మిలియన్ల మంది మరణిస్తున్నారని పేర్కొన్నారు. ఇంత ప్రమాదకరమైన వ్యాధికి నివారణ వ్యాక్సిన్ ఇవ్వడమే నని తెలిపారు. ఊపిరి తీసుకోవడం కష్టం, దగ్గు, జ్వరము, ఆయాసం, దగ్గినప్పుడు ఆకుపచ్చ లేదా పసుపు రంగులో కళ్లె పడటం, గుండె వేగం, శ్వాస వేగం పెరగడం, చలి, నీరసం, ఒళ్ళు నొప్పులు, చాతి నొప్పి, తలనొప్పి వాంతులు తదితర లక్షణాలు ఉంటాయని తెలిపారు.

మిలెట్స్‌తో మహాలక్ష్మి స్వరూపం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: దీపావళి పండుగను పురస్కరించుకొని నగరానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు మోకా విజయ్‌కుమార్ చిరుధాన్యాలతో మహాలక్ష్మీ అమ్మవారి ప్రతిరూపాన్ని తీర్చిదిద్దారు. 2023 సంవత్సరాన్ని ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించింది. దీనిని పురస్కరించుకొని భారతీయ పండుగలలో ముఖ్యమైన ఉత్సవాలను జోడిస్తూ చిత్రాలను విజయ్ కుమార్ చిరుధాన్యాలతో తయారు చేస్తున్నారు. ఇటీవల నిర్వహించిన జి 20 సదస్సులలో ఆయన తయారుచేసిన చిరుధాన్యాల చిత్రాలు ప్రదర్శించారు.

హార్పిక్ పవర్ ప్లస్ విడుదల

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : కొత్త హార్పిక్ ఒరిజినల్ ఫ్రెష్‌ను, తమ పవర్ ప్లస్ శ్రేణి ఉత్పత్తిని విడుదల చేసింది. ఈ సందర్భంగా దక్షిణాసియా-హైజీన్ ప్రాంతీయ డైరెక్టర్ సౌరభ్ జైన్ నగరం లోని ప్రముఖ హోటల్‌లో జరిగిన కార్యక్రమం అనంతరం మీడియాతో మాట్లాడారు. దీర్ఘకాలం పరిమళం తాజాదనంతో గొప్ప క్లీనింగ్‌ను ఈ కొత్త సూత్రీకరణ నిర్ధారిస్తుందన్నారు. పవర్ ప్లస్ శ్రేణి మూడు అదనపు పరిమళాలు- స్పార్కింగ్ లెమన్, రిఫ్రెషింగ్ మెరైన్, జాయ్ ఫుల్ జాస్మిన్‌లో లభిస్తున్నాయని తెలిపారు.

కో-క్రియేటివ్ కార్నర్ ప్రారంభం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఏయూలోని నాస్కామ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కో క్రియేటివ్ కార్నన్‌ను వీసీ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి శనివారం ప్రారంభించారు. జాతీయ విద్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇటువంటి ప్రాముఖ్యత కలిగిన రోజున ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కండి

అంగన్వాడీ కార్యకర్తలతో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్

ప్రజాశక్తి-చింతూరు: అంగన్‌వాడీలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నాలుగున్నర ఏళ్ళు కాలం గడిపిందని, ఆ హామీల అమలు కోసం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం, కనీస వేతనాలు, గ్రాడ్యుటీ, ఉద్యోగ భద్రత కోసం డిసెంబర్ నెలలో నిర్వహించనున్న పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ పిలుపునిచ్చారు. శనివారం చింతూరులో సున్నం రంగమ్మ అధ్యక్షతన జరిగిన నాలుగు మండలాల అంగన్వాడీ సెక్టార్ల లీడర్ల సమావేశంలో వెంకట్ మాట్లాడారు. పక్కనున్న తెలంగాణ రాష్ట్రం కంటే ఒక వెయ్యి రూపాయలు అదనంగా ఇస్తానని గత ఎన్నికల్లో చెప్పిన జగన్మోహన్‌రెడ్డి, ఇవ్వకుండా కార్మికుల్ని మోసం చేశారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త కొత్త యాప్‌లతో అంగన్వాడీల మీద విపరీతమైన పని ఒత్తిడిని పెంచిందన్నారు. నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటుతున్న, అందుకు అనుగుణంగా వేతనాలు పెంచడం లేదన్నారు. సమస్యలపై పోరాటాలు చేస్తుంటే పోలీసులతో నిర్బంధాలు ప్రయోగించి నియంత పాలన సాగిస్తున్నారని విమర్శించారు. సమావేశంలో అంగన్వాడీలు కనక, సుజాత, లలిత, సునీత, జయ, వెంకటరమణ, రమణ, దుర్గ, కనకదుర్గ, పార్వతి, రాములమ్మ, నూకా రత్నం, విజయ, లక్ష్మి, రమ్య తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం

ప్రజాశక్తి- కొయ్యూరు : నర్సీపట్నం లోని సంపత్ ల్యాబ్‌లో హెల్పింగ్ హ్యాండ్స్, అల్లూరి యువ గిరిజన సేవ సంఘం ఆధ్వర్యంలో మదర్ బ్లడ్ బ్యాంకు వారిచే నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో తెలుగు యువత అరుకు పార్లమెంట్ కార్యదర్శి కురుజు శ్రీనుబాబు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు టి.మల్లేష్, డాక్టర్ మల్లికార్జునరావు, డాక్టర్ జివి.రాజు, శివరామరాజు, బిడిజన అప్పారావు, సురబోయిన శ్రావణ్‌కుమార్, ధర్మరాజు, యేర్ల సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న తెలుగు యువత

అటవీ ఉత్పత్తుల విక్రయానికి భవన నిర్మాణం

ప్రజాశక్తి-సీలేరు : పర్యాటకులకు అటవీ ఉత్పత్తులు అందుబాటులో తీసుక రావడానికి జీసీసీ అధికారులు చర్యలు చేపట్టారు. జీకే వీధి మండలం సీలేరు పెట్రోల్ బంకు సమీపంలో అటవీ ఉత్పత్తులు విక్రయాలు జరపడానికి నూతన భవన నిర్మాణ పనులు శరవేగంగా జరుపుతున్నారు. ఈ సందర్భంగా జిసిసి మేనేజర్ మల్లేశ్వరరావు ప్రజాశక్తితో మాట్లాడుతూ భవన నిర్మాణ పనులు డిసెంబరు చివరలోపు పూర్తి చేసి జనవరి నుంచి జిసిసి ఉత్పత్తులు విక్రయాలు జరిపేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ భవనంలో తేనె, అలోవీర సబ్బులు, ఇతర అటవీ ఉత్పత్తులు విక్రయాలు జరుగుతామని తెలిపారు.

సిపిఎం ప్రజా రక్షణ భేరిపై ప్రచారం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : ప్రజా సమస్యల పరిష్కారం కోసం, లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతలు లేని అభివృద్ధి కోసం ఈనెల 15న సిపిఎం ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించే ప్రజారక్షణభేరి బహిరంగ సభకు మండల ప్రజలు, కార్మికులు, ఉద్యోగ ఉపాధ్యాయులు, కర్షకులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని సిపిఎం మండల నాయకులు కొండ్ల సూరిబాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు సూరిబాబు ఆధ్వర్యంలో సిపిఎం నాయకులు శనివారం రాజవొమ్మంగిలో కరపత్రాలు పంచుతూ విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ రాష్ట్రానికి ద్రోహం చేసిన మతోన్మాద బీజేపీని ఓడించాలని, బిజెపికి కొమ్ము కాసే వైసిపి, టిడిపి, జనసేన పార్టీలను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ప్రజా, కార్మిక ఉద్యోగ ఉపాధ్యాకయుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న సిపిఎంను బలపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పొత్తూరు సత్యనారాయణ, మేలిన రమేష్, జె.రాజు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మారేడుమిల్లిలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిపిఎం నేతలు

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

మారేడుమిల్లి : సిపిఎం ప్రజారక్షణ భేరి వాల్ పోస్టర్‌ను మండల కేంద్రంలో శనివారం ఆ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు ఎం వాణిశ్రీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు చేస్తున్న మోసాలను ఎండగట్టాలని, గిరిజనులకు నిలువ నీడ లేకుండా చేస్తున్న బిజెపి, వైసిపిలను ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు ఈతపల్లి సిరిమల్లి రెడ్డి, వీకా రాజన్న దొర, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు 200 పనిదినాలు కల్పించాలి

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సిపిఎం నేత సురేష్

ప్రజాశక్తి- చింతూరు : రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల్లో పంటలు సర్వం కోల్పోయి ఉపాధి లేక ఆదాయం లేక కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయని, ప్రభుత్వం ఉపాధి హామీ కింద 200 పని దినాలను కల్పించాలని, రోజు వేతనం రూ.600 ఇవ్వాలని సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్ డిమాండ్ చేశారు. మండలంలోని మధుగురు గ్రామంలో శనివారం ప్రజారక్షణ భేరి ప్రచార కార్యక్రమం చేపట్టిన సిపిఎం నాయకులు ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రదేవానికి వెళ్లగా, ఉపాధి కార్మికులు తమ సమస్యలను సిపిఎం నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. పని ప్రదేశంలో సేదతీరడానికి నీడ లేదని, మంచినీటి సౌకర్యం, ప్రథమ చికిత్స కిట్టు లేవని తెలిపారు. కూలి డబ్బులు అరకొరగా ఇస్తున్నారన్నారు. ఈ సందర్భంగా నేతలు సురేష్, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తుందని, ప్రతి ఏటా బడ్జెట్ తగ్గిస్తుందని చెప్పారు. రానున్న రోజుల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ప్రజా సమస్యలపై పోరాడుతున్న సిపిఎంను బలబర్చాలని, ఈ నెల 15న విజయవాడలో జరుగు సిపిఎం బహిరంగ సభకు వేలాదిగా తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కారం సుబ్బారావు, పాండు సుబ్బారావు, కారం మనోజ్, ఉగ్గల సీతారామయ్య, పండ నారాయణ, సాయం రాజులు, సౌల ముఖేష్, జోడి సారయ్య, కారం బాబురావు, సీతమ్మ, పండ నాగమణి, రత్తమ్మ, పాండు బియ్యం, పులి జానకమ్మ తదితరులు పాల్గొన్నారు.

సిసి రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం దారకొండ పంచాయతీ ఏనుగు బయలు గ్రామం ఒరియ క్యాంపులో సిసి రోడ్డు నిర్మాణ పనులు శనివారం సర్పంచ్ ఎన్.రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు లక్షలు రూపాయలు ఎన్ఆర్ఇజిఎస్ నిధులతో ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో సిసి రోడ్డు నిర్మాణం చేస్తున్నట్లు చెప్పారు. కొంతకాలంగా ఒరియా క్యాంపులో రహదారి సౌకర్యం లేక ప్రజలు అనేక ఇబ్బందులకు గురయ్యేవారిని, సిసి రోడ్డు నిర్మాణంతో ఆ సమస్య తొలగిపోతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాడి రామన్న పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, వైసిపి మండల బీసీ సెల్ అధ్యక్షులు పిల్ల బుజ్జి, వార్డు సభ్యులు మోహన్ బాబు, యోగేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

జరుగుతున్న సిసి రోడ్డు నిర్మాణ పనులు

మండల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలో నెలకొన్న పలు సమస్యలను జనసేన అల్లూరి విశాఖ రూరల్ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్ బాబు దృష్టికి ఆ పార్టీ మండల నాయకులు సాగిన బుజ్జిబాబు, లక్ష్మణ్ తీసుకెళ్లారు. అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు విచ్చేసిన పంచకర్ల రమేష్ బాబును వారి కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సుధీర్, నివాస్ సిద్దు రాజేష్, స్వామినాయుడు పాల్గొన్నారు.

ట్రాన్స్‌పోర్టు వాహనాలు అద్దెకు తిప్పితే చర్యలు

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మారేడుమిల్లి బొలెరో వాహన యజమానులతో రంపచోడవరం మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఆర్ రాజేష్ శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ మారేడుమిల్లి పర్యాటక ప్రాంతాల్లో బొలెరోలు, జీపులు పర్యాటకులను చేరవేస్తున్నాయని, దీనిలో భాగంగా నాన్ ట్రాన్స్‌పోర్టు వాహనాలు తిరుగుతున్నాయని తెలిపారు. వాటిని తక్షణమే ట్రాన్స్‌పోర్టు వాహనాలుగా రికార్డులను ఈ నెలాఖరు లోపు మార్చుకోవాలని యజమానులకు సూచించారు. ట్రాన్స్‌పోర్టు వాహనాలతో అద్దెకు తిప్పినట్లయితే శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ట్రాన్స్‌పోర్టు వాహనాలకు ఇన్సూరెన్స్, పొల్యూషన్, పర్మిట్, రికార్డు, వాహనం నడిపే వారికి డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఆనంద్ ఇన్నా, సునీల్ కిషోర్ రెడ్డి, ఎండి ఎఎస్‌ఏ బాబా, ఎస్‌కె ఖాదర్, లోత లక్ష్మణ్ రెడ్డి, సుబ్బారెడ్డి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపిని మళ్లీ గెలిపించాలి

ప్రజాశక్తి -సీలేరు : 2024 ఎన్నికల్లో వైయస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలోని వైసిపి ప్రభుత్వాన్ని గెలిపించాలని జీకే వీధి ఎంపీపీ బోయిన్ కుమారి విజ్ఞప్తి చేశారు. మండలంలో జగనన్నే మా నమ్మకం అనే కార్యక్రమాన్ని శనివారం వైసీపీ మండల అధ్యక్షులు బొబ్బిలి లక్ష్మణ్ ఆధ్వర్యంలో చేపట్టారు. వచ్చే ఎన్నికల్లో కొట్టగుల్ల భాగ్యలక్ష్మిని ఓటుతో ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు నాగమణి, రాజులమ్మ, దావుదు, మండల కో ఆప్షన్ నెంబరు వంతలఅరుణ్ మరియు మండల వైసిపి యూత్ ప్రెసిడెంట్ కృపా చిన్నారావు, వాలంటీరు పుష్ప కుమారి, గృహసారథులు చరణ్, పూజారి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణాపై దృష్టి

ప్రజాశక్తి -సీలేరు : పర్యాటకులు ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లో ప్రకృతి అందాలు తిలకించడానికి వచ్చి పనిలో పనిగా గంజాయి అక్రమ రవాణాకు పాల్పడతారని పోలీసులకు అనుమానాలు వ్యక్తమైన నేపథ్యంలో పర్యాటకుల ముసుగులో గంజాయి అక్రమ రవాణాపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా జీకే వీధి మండలం సీలేరు పెట్రోల్ బంక్ సమీప ప్రధాన రహదారిపై స్థానిక ఎస్సై సిబ్బందితో శనివారం ఉదయం విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. రికార్డులు క్షుణ్ణంగా పరిశీలించి వాహనాలను విడిచిపెట్టారు. ఆ సమయంలో ద్విచక్ర వాహనాలపై ముగ్గురు యువకులు వస్తుండగా వారిని నిలిపి ఈ ప్రాంతానికి ఎందుకు వచ్చారని ప్రశ్నించి, వారి బ్యాగులు తనిఖీ చేసి ఐడి కార్డులు పరిశీలించి వివరాలు సేకరించి విడిచిపెట్టారు. ఎంతోమంది ఇంజనీరింగ్ విద్యార్థులు గంజాయి అక్రమ రవాణాకు పాల్పడి జైల్లో మగ్గుతున్నారని, అటువంటి కార్యకలాపాలకు పాల్పడవద్దని యువకులకు హితవుపలికారు.

20 లీటర్ల నాటుసారాతో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి -సీలేరు : అక్రమంగా తరలిస్తున్న 20 లీటర్ల నాటుసారాను సీలేరు పోలీసులు శనివారం స్వాధీనం చేసుకొని, నిందితుడిని అరెస్టు చేశారు. స్థానిక ఎస్ఐ రామకృష్ణ కథనం ప్రకారం... జీకే వీధి మండలం దారకొండ పంచాయతీ సాకిరేవు గెడ్డ గ్రామం నుంచి నాటు సారా అక్రమ రవాణా చేస్తున్నట్లు అందిన ముందస్తు సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. 20 లీటర్లు నాటుసారాను తరలిస్తున్న కిముడు బుద్రును అదుపులోకి తీసుకుని ఆయన దగ్గర ఉన్న 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని విచారించిన అనంతరం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు. నాటుసారా తయారీ, విక్రయాలు చట్టరీత్యా నేరమని, అటువంటి కార్యకలాపాలకు ఎవరు పాల్పడినా కఠిన చర్యలు తప్పని ఎస్ఐ రామకృష్ణ హెచ్చరించారు.

నాటుసారా, నిందితునితో పోలీసులు